


# 5

డా॥ ఆలూరి విజయలక్ష్మి

# అగ్నిగుండం

జానకి తుళ్ళిపడి లేచి కూర్చుంది. కలలో నిజంలా వినిపించిన శార్వరి ఏడుపు ఇంకా చెవుల్లో సుడులు తిరుగుతూనే వుంది. రెండు అరచేతుల్తో చెంపల్ని ఒత్తుకుంటూ గుండెల్లోని ఉద్వేగాన్ని అణచుకోవడానికి ప్రయత్నిస్తూంది. ప్రక్కమంచంమీద సన్నగా గురక కొడుతున్న శ్రీనివాస్ వంక విసుగ్గా చూచింది. మళ్ళీ నిద్రపోదామని ఎంత ప్రయత్నించినా మనసులోని అలజడి నిలవనివ్వడం లేదు. గడిచిపోయిన జీవితాన్ని తలచుకుంటుంటే పాతాళంలోకి నెట్టివేయబడుతున్న భావన తన కాళ్ళక్రింద భూమిని ఎవరో గుంజుకుంటున్న భావన.... అవును.... తనకాళ్ళ క్రింద భూమిని బలవంతంగా లాగేసుకుంటున్నారు. భూమితో ముడిపడి, భూమి చుట్టూ అల్లుకున్న తమ జీవితాల్ని ధ్వంసం చేస్తున్న శక్తులేవో స్పష్టంగా తెలియకపోయినా అవి సృష్టిస్తున్న అల్లకల్లోలం అనుక్షణం అనుభూతమవుతూ తల్లడిల్లిపోతూంది జానకి. వెన్నెల పరదాల మాటున అమాయకంగా నిద్రిస్తున్న ప్రకృతిని చూస్తూ ఆలోచనలలోకి జారిందామె.

కాలేజి చదువు గురించి కలలు కంటున్న జానకి ఆశల్ని వమ్ముచేస్తూ పెద్దలు ఆమె పెళ్ళిని నిశ్చయం చేసారు. పాడిపంటలతో, మండువా లోగిలితో, తినటానికి, వుండటానికీ లోటు లేని ఇంట్లో ఇస్తే పిల్ల సుఖపడుతుంది, ఇన్నాళ్ళూ ఊళ్ళో చదువు గనక చదివించాము, ఆడపిల్లని పై వూళ్ళకు పంపి చదివిస్తే నలుగురూ ఆక్షేపిస్తారు, ఊళ్ళో

**తమనుంచి స్వాధీనపరుచుకున్న భూమిలో పెద్ద పెద్ద పరిశ్రమలు వస్తాయంటున్నారు. ఇక్కడి వారెంతమందికో ఎన్నో ఉద్యోగాలొస్తాయంటున్నారు, ఈ ప్రాంతమంతా అభివృద్ధి అయిపోతుందని హోరు పెడుతున్నారు. లక్షలాదిమంది పేద ప్రజల కడుపు కొట్టే అభివృద్ధి ఏమిటో, ఆ అభివృద్ధి ఎందుకోసమో, ఎవరి కోసమో మొదట్లో అర్థం కాకపోయినా క్రమేపీ ఎవరి అభివృద్ధికోసం పేదల బ్రతుకుల్ని కాపాడ వలసిన ప్రభుత్వాలు మోసపూరితంగా, దౌర్జన్యంగా, తమ పంటపొలాల నుండి, తమ ఇళ్ళ నుండి, తమ ఊరి నుండి వెళ్ళగొడుతున్నాయో అర్థ మయింది.**

సంబంధం, పిల్ల మనకళ్ళముందు ఉంటుంది అనే ఆలోచనలతో శ్రీనివాస్‌తో జానకి పెళ్ళి జరిపించారు.

ఉద్యోగం చేసుకునే వాడిని పెళ్ళాడాలనే కోరిక ఉన్నప్పటికి పెద్దల మాటకు ఎదురు చెప్పకుండా పెళ్ళికి ఒప్పుకున్న జానకి తన కోరికల్ని ప్రక్కన పెట్టి అత్తింట్లో ఒదిగిపోయింది. కట్నకానుకల కోసం, పెట్టుపోతల కోసం తనను సూటిపోటి మాటలన కుండా, తన పుట్టింటివారిని కించపరుస్తూ మాట్లాడ కుండా తనను అభిమానంగా చూచుకునే అత్తమామలు, ఆడబడుచులిద్దరి పట్లా తనూ అభిమానాన్ని, గౌరవాన్ని చూపేది. కాని ఇద్దరు పిల్లలు పుట్టాక కూడా అర్థం కానిది శ్రీనివాస్ మనస్తత్వమే. తనపట్ల ఏనాడూ అతను ప్రేమను వ్యక్తపరచలేదు. అభిమానంగా మాట్లాడలేదు. మాటల్తో గాని, చేతల్తో గాని బయటికి కనపడేలాగా తనను బాధించని శ్రీనివాస్ అందరి దృష్టిలో ఆదర్శ భర్త, ఉత్తమ పురుషుడు. కాని ఆ ఆదర్శ భర్త తనని ఎప్పుడూ ఒక మనిషిగా పరిగణించలేదని, తన మాటకి ఎప్పుడూ విలువివ్వలేదని, తనకి, పిల్లలకి, కుటుంబానికి సంబంధించిన నిర్ణయాలలో తనకు చోటేలేదని ఇతరులకు చూచాయగా కూడా తెలియనంత గుట్టుగా, భర్త మాటను జవదాటకుండా,నోరెత్తి ప్రశ్నించకుండా ఆదర్శపత్ని పాత్రను తనూ దిగ్విజయంగా పోషించింది. తనని ఒక్కమాట కూడా అడగకుండా, తనతో సంప్రదించకుండానే పిల్లల చదువు నెపంతో కాకినాడలో కాపురం పెడుతున్నప్పుడు అతిస్పష్టంగా, చర్చకు తావులేని విధంగా అతను తన పరిధి ఏమిటో వివరించినప్పుడు ఆ ఉత్తమ పురుషుడి దృష్టిలో భార్యస్థానమేమిటో, స్త్రీ స్థానమేమిటో జానకికి బాగానే అర్థమయింది.

జూదం, తాగుడు తదితర వ్యసనాలేమీ లేకపోయినా తాహతుకు మించి డాబుగా, దర్జాగా బ్రతకడం కూడా ఒక వ్యసనమే, అది కూడా సంసారాన్ని నాశనం చేస్తుందనే తన హెచ్చరికను పెడచెవిని పెట్టి ఆయన చేసిన ఖర్చులకు రెండు ఎకరాల భూమి హరించుకుపోయినప్పుడు అత్తగారు, మామగారు గొడవ చేసారు. బస్తీ కాపురం చాలించి వూరికి వచ్చేయమని పోరు పెట్టారు. వారిని ఎదిరించి బ్రతికే పరిస్థితి లేక వూరికి తిరిగి వచ్చేసినప్పుడు శార్వరిని, బాబుని హాస్టల్‌లో చేర్పించారు. పిల్లలు తన దగ్గర లేరనే చింత వున్నా, అత్తమామలకు దగ్గరగా వుండడంతో శ్రీనివాస్ గురించి కొంత స్థిమితంగా అనిపించింది జానకికి. ఆ స్థిమితమూ ఎన్నేళ్ళో నిలవలేదు. ఒకరి వెంట ఒకరు కొద్దినెలల తేడాతో అత్తగారు, మామగారు తిరిగిరాని లోకాలకుతరలిపోవడంతో ఆమెను అంతులేని దిగులు ఆవహించింది. ఒంటరి దానిని అయిపోయానన్న నిర్వేదం, భవిష్యత్తును తలచుకుంటే అంతులేని భయం తనను కుదుపుతున్నప్పటికి బయటకు బింకంగానే తిరిగేది. పెళ్ళైన నాటినుంచి ఏ ఒక్క విషయంలోనూ తన అభిప్రాయానికి తావేలేని పరిస్థితి రగిలిస్తున్న అవమానభారం అప్పుడప్పుడూ మనసు పొరల్లోంచి పైకి ఉబుకుతున్నప్పటికి దానిని అణిచివేసేది. భర్త కాఠిన్యం అందించిన తాళాన్ని ప్రయత్నపూర్వకంగా, ఐచ్ఛికంగా తన మనసుకు, నోటికి బిగించాక, బ్రతుకులోని ఏ పర్యవసానాలూ తనను కదిలించకుండా కట్టడి అయిపోయింది.

అదీ ఎంతోకాలం సాగలేదు. శార్వరి చదువు విషయంలో తన కోరిక తీరలేదు. ఇంజనీరింగ్ చదివిస్తే బావుంటుందని అనుకుంది తను. వద్దు, పెళ్లి చేసి పంపించేదానికి డిగ్రీ చాలు అని శ్రీనివాస్ అన్నప్పుడు నోరు మెదిపే సాహసాన్ని ఎప్పుడో కోల్పోయిన తను మరి వాదించలేదు. కాని తమ తాహతుకు మించిన సంబంధం తెచ్చి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అల్లుడికోసం, వున్న పద్దెనిమిది ఎకరాల్లో పది ఎకరాల్ని కట్నంగా ఇవ్వడానికి సిద్ధపడిపోయి నప్పుడు నోటికి వేసుకున్న తాళాన్ని విప్పింది తను.

"మనకు తగ్గ సంబంధాన్ని చూచుకుందాం. ఉన్నదంతా శార్వరికి కట్నంగా ఇచ్చేస్తే బాబు చదువు ఎలా సాగుతుంది?" అన్న జానకి వంక కళ్ళురిమి చూచి ఆమెకు సమాధానం కూడా చెప్పనవసరం లేదన్నట్లు వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

"కట్నకానుకలతో నాకు సంబంధం లేదు. పెళ్ళిమాత్రం గ్రాండ్‌గా జరిపించాలంటున్నాడు మావాడు. అందుచేత ఏర్పాట్లు జాగ్రత్తగా చెయ్యండి". పెళ్ళి ఖాయం చేసుకున్నాక పెళ్ళికొడుకు తండ్రి చేసిన హెచ్చరిక వినగానే జానకి గుండెల్లో రాయి పడింది. వరుసగా మూడేళ్ళ నుంచి పంట చేతికొచ్చే సమయంలో ఏదో ఒక ఉత్పాతం వచ్చి పొలంలో పెట్టుబడికి చేసిన అప్పులు, కష్టాలే మిగిలేయి తప్ప కష్టార్జితం కాదు. గ్రాండ్‌గా పెళ్ళిచేయడం అంటే మాటలా ! లక్షల్లో అప్పులు ! పొలాల ధరలు పెరిగాయి కదా, ఒకటో, రెండో ఎకరాల్ని అమ్మితే అప్పుల్నీ తీర్చేయొచ్చు. కూతురు పెళ్ళినీ ఘనంగా చేసెయ్యొచ్చు అని ఆయన ధీమా.... పొలాన్ని కన్న కూతురి కంటే ప్రాణంగా చూసుకునేవారు మామగారు. అప్పుల పాలవ్వడమన్నా, పొలాన్ని అమ్మడమన్నా కుటుంబ ప్రతిష్టను మంటగలపడమే అని భావించిన ఆయన క్రితంసారి కొడుకు చేసిన అప్పులకు పొలాన్ని అమ్మినప్పుడు ఎంతటి అవమానాన్ని, బాధని అనుభవించారో తనకు తెలుసు. కాని.... ఇదేమిటి?! ఈయనకు చీమ కుట్టినట్టైనా లేదే ! సునాయాసంగా అప్పులు చేసేసి కూతురి పెళ్ళి ఏర్పాట్లు చేస్తున్నారు...తనలో తాను మథన పడడం తప్ప జానకి దేనినీ అడ్డుకోలేకపోయింది. ఈడూ జోడుగా వున్న కూతుర్ని, అల్లుడ్ని చూచి, కూతురి సంతోషాన్ని చూచి తన ఆందోళనను తాత్కాలికంగా మరచిపోయింది. వియ్యాలవారి గొంతెమ్మ కోరికల్ని, తమ శక్తికి మించినవే అయినా, తొట్రుపాటు లేకుండా నెరవేరుస్తున్న భర్త ధైర్యానికి ఆశ్చర్యంగానూ ఉందామెకు.

శార్వరిని కాపురానికి పంపాక కాస్త ఊపిరి

పీల్చుకుని పొలం అమ్మి అప్పులు తీరుద్దామనుకునేం తలో తమ ఊపిరి ఆగిపోయే పరిణామాలు చోటు చేసుకున్నాయి. అప్పటివరకు అప్పుడప్పుడు పుకార్లుగా, ఈ మధ్య నిజాలేనన్నట్లుగా వినిపించినవి, నిజంగానే తమ పీకలమీదకు కత్తుల్లో వచ్చి పడ్డాయి.

స్పెషల్ ఎకనామిక్ జోన్ కోసం వేలాది ఎకరాలను స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధమై పోయింది. అందులో తమ ఊరి పొలాలూ ఉన్నాయి. తమపొలాల్ని ఊడలాక్కోవడమే కాదు, తమ ఊరితో పాటు కొన్ని ఊళ్ళను కూడా ఖాళీ చేయిస్తారని ఊరంతా గగ్గోలుగా వుంది. భూమిని కోల్పోవడం, జీవనాధారాన్ని కోల్పోవడం ఒక ఎత్తు. తాము పుట్టి పెరిగిన ఊరిని, తమ జీవితాలతో పెనవేసుకున్న వ్యక్తుల్ని వదిలి, కష్టాలనూ, కడగండ్లనూ ఎదు ర్కొంటూ బ్రతుకు బండిని లాగడానికి అవసరమైన శక్తిని,స్ఫూర్తిని ఇస్తున్న అనుబంధాలనూ, మమతలనూ, ఆప్యాయతలనూ తెంచుకుని వెళ్ళడం అనే ఊహకే ప్రాణం పోతున్నట్లుగా వుంది. తెలియని ఊళ్ళో, తెలియని మనుషుల మధ్య ఎలా బ్రతకడం! బ్రతుకు భరోసానే కోల్పోయాక జీవించడం ఎలా!.... ప్రాణ ప్రదంగా పెంచుకున్న చెట్లు వేళ్ళతో సహ పెకిలింప బడి కుప్పకూలుతున్న దృశ్యం, అందమైన పుష్ప వనాలు తగలబడిపోతున్న దృశ్యం, శవాల గుట్టలు పోగుపడుతున్న దృశ్యం.... జానకి హృదయం అతలాకుతలమైపోతూంది.

తమనుంచి స్వాధీనపరుచుకున్న భూమిలో పెద్ద పెద్ద పరిశ్రమలు వస్తాయంటున్నారు. ఇక్కడి వారెంతమందికో ఎన్నో ఉద్యోగాలొస్తాయంటున్నారు, ఈ ప్రాంతమంతా అభివృద్ధి అయిపోతుందని హోరు పెడుతున్నారు. లక్షలాదిమంది పేద ప్రజల కడుపు కొట్టే అభివృద్ధి ఏమిటో, ఆ అభివృద్ధి ఎందుకోసమో, ఎవరి కోసమో మొదట్లో అర్థం కాకపోయినా క్రమేపీ ఎవరి అభివృద్ధికోసం పేదల బ్రతుకుల్ని కాపాడ వలసిన ప్రభుత్వాలు మోసపూరితంగా, దౌర్జన్యంగా, తమ పంటపొలాల నుండి, తమ ఇళ్ళ నుండి, తమ ఊరి నుండి వెళ్ళగొడు తున్నాయో అర్థ మయింది. వందల ఎకరాలు సరిపోయే పరిశ్రమలకోసం వేలాది ఎకరాల్ని సేకరించడంవల్ల ఎవరు అభివృద్ధి అవుతారో కూడా అర్థమయింది. కాని ఎవరి నడిగినా తమకు అర్థంకాని, అర్థమయినా అంగీక రించలేని చట్టాల గురించి, చట్టాలలో లేని వాటిని కూడా తమపై దౌర్జన్యంగా ఎలా రుద్దుతున్నారో చెప్ప న్నారే తప్పితే ఖచ్చితమైన తరుణోపాయం చూపిం చడం లేదు.


రోజులు గడుస్తున్న కొద్దీ అంతా అగమ్య గోచరంగా వుంది జానకికి. కాసేపు మనసంతా స్తబ్ధంగా, శూన్యం ఆవరించినట్లుగా, ఆలోచనలూ, అనుభూతులూ ఇంకిపోయినట్లుగా అనిపించడం, మరి కాస్సేపటికి ఉప్పెనలా పొంగి వస్తున్న దుః ఖం, మరుక్షణం ఏ రాక్షసుడో అకస్మాత్తుగా తమపైకి లంఘించి తమ సమస్తాన్ని లాక్కుపోతున్న భీతి.....

ఇరవై సంవత్సరాల క్రితం కాకినాడ దగ్గర వున్న తమ పొలాల్తో పాటు కొన్ని వందల ఎకరాల్ని గుజరాత్‌కి చెందిన సంస్థవారు పరిశ్రమల్ని పెట్టడాని కని ప్రభుత్వం సేకరించడం, పరిశ్రమలు పెడితే ఈ ప్రాంతమంతా ఎంత అభివృద్ధి చెందుతుందో, ఎన్నివేలమంది స్థానికులకు ఉద్యోగాలు వస్తాయో చెప్పి ఊరించడం గుర్తుకొచ్చింది జానకికి. తదుపరి ఆ సంస్థవారు ఏ పరిశ్రమల్ని స్థాపించలేదు. తమపొలాలు మాత్రం వారికి దాఖలయిపోయాయి. తమకు అవసరం వుండి అమ్ముకుంటే అది వేరు. కాని తమ నుంచి బలవంతంగా లాక్కున్న భూమి విలువ ఈ రోజు వేలనుండి కోట్లకి పెరిగింది. ఎందుకోసం భూమిని సేకరించారో అది జరిగితే కొంతలో కొంత నయమే. కాని అలా జరగనప్పుడు పెరిగిన భూమి విలువలో న్యాయమైన వాటాను భూమిని ఎవరినుంచి తీసుకున్నారో వారు పొందే విధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు చట్టాల్ని ఎందుకు రూపొందించడం లేదు?.... ప్రభుత్వాలు పనిచేయవలసింది అధిక సంఖ్యాక ప్రజల హక్కుల్ని కాపాడడానికా లేక కొద్దిమంది బడాబాబులు స్వార్థ ప్రయోజనాలకోసమా ?!.... జానకి హృదయంలో సెగ లేస్తోంది.

ఈ స్పెషల్ ఎకనామిక్ జోన్‌ల వల్ల ఎవరు అభివృద్ధి అవుతున్నారో, ఎవరు బలి అవుతున్నారో దేశవ్యాప్తంగా జరుగుతున్న సంఘటనల పరంపరలు నిరూపిస్తూనే ఉన్నాయి. అయినా ఆ పిడుగు ఇప్పుడు తమ నెత్తిమీద పడడంతో దిక్కుతోచక అంత ధైర్య శాలీ, శ్రీనివాస్ స్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. కాకినాడ దగ్గర పొలాల్ని లాక్కున్నప్పుడు మార్కెట్ రేటుకంటే రెట్టింపు ధర చెల్లించడంతో భవిష్యత్తులో ఊహించనలవికానంతగా భూమి ధర పెరుగుతుందని అనుకోక అప్పటికి సంతోషపడ్డారు. కాని ఇప్పుడు జరుగుతుందేమిటి? మార్కెట్ ధరలో నాలుగోవంతు ధర కూడా ఇవ్వకుండా భూమిని లాక్కుంటున్నారు. అందుకు ఒప్పుకోకపోతే ఎలాగైనా నయానో, భయానో ఒప్పించడానికి బ్రోకరేజి ఇచ్చి మరీ కంపెనీల ప్రయోజనాల్ని కాపాడడానికోసం ప్రభుత్వమే మనుష్యుల్ని నియమించింది. ప్రభుత్వమే ఒక బ్రోకర్‌గా మారడం ఎంత విషాదం! ప్రభుత్వంచే అనధికారంగా నియమితులయిన వారు కొన్నేళ్ళ క్రితం తాము విన్న రికార్డునే మళ్ళీ వినిపిస్తున్నారు. ఈ ప్రాంతమంతా ఎంత అభివృద్ధి చెందిపోతుందో, తమ పిల్లలకు ఎంత మంచి మంచి ఉద్యోగాలు ఎంతెంత జీతాలతో వస్తాయో,ఆకర్షణీయమైనకథలు చెప్తున్నారు. ఇప్పుడు ఇవ్వచూపుతున్న ధరకు ఒప్పుకోకపోతే కోర్టుద్వారా బ్యాంక్‌లో జమచేసేది దీనిలో సగం కూడా వుండదు. పొలం ఇవ్వక ఎలాగూ తప్పదు అని బెదిరిస్తున్నారు. దానితో ఈ మాత్రం కూడా దక్కదేమోనని కొంత మంది రైతులు జడిసిపోయి, అందరం కలిసి ఎదిరిస్తే ఎంతో కొంత ఫలితం వుంటుంది, ఒప్పుకోవద్దని ఎంతచెప్పినా వినకుండా డబ్బులు తీసుకుని పొలాన్ని స్వాధీనపరిచారు. విభజించి పాలించే తెల్లవాడి నీతి విజయవంతంగా అమలయిపోతూ పేద రైతుల నోళ్ళలో మట్టికొట్టింది. తెలివి తెచ్చుకుని జరిగిన మోసం తెలుసుకునేసరికి పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. కాపాడవలసిన చేతులే తమ గొంతుల్ని నులుముతుంటే ఎవరితో మొరపెట్టుకోవాలోవారికి తెలియడం లేదు.

నెలరోజుల క్రితం శార్వరి ఫోన్ చేసేదాకా జానకికి అసలు విపత్తు గురించి ఆలోచన రాలేదు. తమకు కట్నంగా పదిఎకరాలు ఇవ్వడానికి ఒప్పందం కనుక తమకు ఇస్తానన్న భూమిని ప్రభుత్వం లాక్కుంటే మరోచోట పది ఎకరాల్ని కొని ఇవ్వవలసిందేనని వియ్యాలవారి మనోగతాన్ని శార్వరి చెప్పడంతో జానకికి పెనుతుఫానులో చిక్కుకున్నట్లుగా వుంది.

శార్వరి పెళ్లికి చేసిన అప్పు ఇంకా చిల్లిగవ్వకూడా తీరలేదు. స్పెషల్ ఎకనామిక్ జోన్ వెలుపల వున్న పొలాల ధరలకు రెక్కలొచ్చాయి. తీసుకున్న పొలానికి పరిహారంగా ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో నాలుగు ఎకరాలను కొనగలిగితే గొప్పే. తమ భూముల్ని ఇచ్చేది లేదని,



తమకు 'సెజ్'లు వద్దని, ఏ శిక్షణలు, నైపుణ్యాలు లేని తమకు పెట్టబోయే పరిశ్రమల్లో ఎంత గొప్ప ఉద్యోగాలు వస్తాయో తమకు తెలుసునని, తమ జీవితాల్ని నాశనం చేసే దుర్మార్గపు అభివృద్ధి తమకు అక్కర్లేదని రైతులు ఉద్యమించారు. జైళ్ళకు వెళ్ళవలసి వస్తున్నప్పటికి జారిపోతున్న ధైర్యాన్నీ, శక్తినీ కూడగట్టుకుంటూ పోరాడుతున్నారు. కాని, ఈలోపు కూలిపోతున్న బ్రతుకుల మాటేమిటి? తమలాగా త్రిశంకు స్వర్గంలో వుండి అటు బయటపడి గట్టిగా ఏడవనూ లేక, ఇటు పోరాడనూ లేక, మరొకవైపు కొత్తగా పుట్టు కొస్తున్న సమస్యల్ని ఎలా పరిష్కరించుకోవాలో తెలియక కొట్టుమిట్టాడుతున్న వారి పరిస్థితి ఏమిటి?.... జానకి కళ్ళముందు కటికచీకటి. హృదయంలో దుఃఖ సముద్రం.

శార్వరి చెప్పకపోయినా పొంచివున్న మరో విపత్తు ఊహకు అందగానే మరింత ఆందోళన జానకిని కుదుపుతూంది. అనుకున్నట్లుగా భూమిని అప్పజెప్పలేకపోతే, అప్పజెప్పాకే మళ్ళీ రమ్మని శార్వరిని తమ ఇంటికి పంపేస్తారేమోనన్న భయం ఆమెను తినేస్తూంది...కూతురి కాపురాన్ని ఎలా సరి చేయడం ? భూమి పోయి, సరైన చదువు, స్థిరమైన ఉద్యోగం లేని కొడుకు ఎలా ఈ డబ్బు ప్రపంచంలో బ్రతుకుతాడు?! ఎలా తామిద్దరి మిగతా జీవితం గడుస్తుంది!... జానకిముందు బెంబేలెత్తిస్తున్న ప్రశ్నలు.

అభివృద్ధి మంత్రం జపిస్తున్న కొత్త ప్రపంచంలో మామూలు మనుషులకు చోటే లేకపోతే, వారికి చావడం తప్ప మరో గత్యంతరం లేకపోతే ఆ అభివృద్ధికి అర్థమేమిటి? ఎప్పుడు ఏమవుతుందో, ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో, ఏ క్షణాన తమనోటికి ఒక్క ముద్ద కూడాదక్కని పరిస్థితులొస్తాయోనని, తమకు భద్రతనిస్తాయని నమ్ముతున్న ఆస్తుల్ని ఎవడెప్పుడు దౌర్జన్యంగాకబ్జా చేసి కబళించేస్తాడో, ఆనక గౌరవప్రదంగా, హుందాగా జీవించలేని సంక్షుభిత స్థితి వుంటుందేమోనని ఎక్కువమంది ప్రజలు అనుక్షణం భీతితో బ్రతకడాన్ని తప్పనిసరి చేస్తున్న ఈ ప్రపంచమేమి ప్రపంచం ? ఈ ప్రపంచాన్ని సృష్టిస్తున్న, కొమ్ముకాస్తున్న, నడిపిస్తున్నశక్తుల్ని అన్ని శక్తులనుండీ వంచితులవుతున్న సామాన్యులెలా నిలువరించ గలరు?!.... కాని... కాలే కడుపుల్ని పట్టుకుని అలమటిస్తున్న నిస్సహాయజీవులు ఎప్పటికీ అలాగే ఉండిపోతారా?!.. ఆకలి అగ్రహాన్ని రగిలించదా?!.... బేలగా పొట్టను పట్టుకున్నచేతులు ఉద్రేకంతో పిడికిళ్ళుగామారవా?!.. రగులుతున్న హృదయాలు విస్ఫోటించవా ?!.... జానకి గుండె మండుతూంది.


మీ అక్షరాలను అచ్చు వేయాలనుకుంటే

పోస్ట్‌ద్వారా గాని, ఫోన్‌ద్వారా గాని సంప్రదించండి.

అందంగా, గ్రంథంగా ప్రచురించి మీ కందిస్తాం

**చినుకు ప్రచురణలు**




**చినుకు ప్రచురణలు**

దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
✆ 0866-6640595 , సెల్ : 98481 32208
Fax No. 0866-6697375 : : E-mail : editor_chinuku@yahoo.com